క్లుప్తంగా

శలపాడులో గాయత్రీ హోమం



చేబ్రోలు: చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో ఆదివారం గాయత్రీ హోమం వైభవంగా నిర్వహించారు. శలపాడులోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం గాయత్రీ యజ్ఞంను అర్చకులు ఘనంగా నిర్వహించారు. గంజాం సత్యనారాయణచార్యులు, మహేంద్ర బాబుల ఆధ్వర్యంలో జరిగిన గాయత్రీ యజ్ఞం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

10న కళాదర్బార్ ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పురస్కరించుకొని శ్రేష్ట హాస్పిటల్ సౌజన్యంతో ఈ నెల 10న వివిధ రంగాలలోని విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాలు అందిస్తున్నట్లు కళాదర్బార్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పాత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. రంగారావు మాట్లాడుతూ బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై 10న సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శన, సినీ సంగీత విభావరిలు ఉంటాయని తెలిపారు. అనంతరం సినీ నటి శ్రీమణి, ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్, డాక్టర్ షమ సుల్తానా, గాయని పి సుజాత, సాహితీవేత్త పచ్చిపులుసు సూర్యనారాయణ, నృత్య కళాకారిణి మహంకాళి నాగలక్ష్మిలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కుమార్, శేఖర్, బాబూరావు, బి. రాజశేఖర్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి

పట్నంబజారు: అనుమానాస్పదస్థితిలో యువతి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంకొండ మండలం బోధనం గ్రామానికి చెందిన తోట భూమిక (24) గుంటూరు నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ రామిరెడ్డితోటలో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తలుపులు తీయకపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా, భూమిక అనుమానాస్పద స్థితిలో మృతిచెంది పడి ఉంది. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతురాలి పక్కన పలు ఇంజక్షన్లు ఉండటంతో, ఆమె చేసుకుందా.. మరేదైనా జరిగిందా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి సోదరుడు సాగర్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఈద్గా గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ గడిచిన రెండువారాలుగా ప్రీమియర్ లీగ్ సీజన్–3 పోటీలు ఆదివారం ముగిసినట్లు తెలిపారు. ఫైనల్ పోటీల్లో యాంగ్రీ టైగర్స్ టీంపై రాయల్ ఫైటర్స్ టీం క్రీడాకారులు గెలుపొందారు. వారికి మాజీ సర్పంచ్ నాగుల్ మీరా షరీఫ్ రూ.10,116లు బహుమతి నగదు అందజేశారు. రెండో బహుమతిని రన్నరప్ టీం సభ్యులకు రూ.5,116 నగదును సొసైటీ చైర్మన్ షేక్ ఖాజావలి అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పెదజానీ, బెస్ట్ బౌలర్‌గా రాజాలకు ఒక్కొక్కరికి రూ.1500 నగదును షేక్ ఇమాం ఖాజావలి అందజేశారు.

నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన చంద్రిక



మంగళగిరి: ఈనెల 8వ తేదీ నుంచి 1 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న సీనియర్ నేషనల్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024 పోటీలకు రాష్ట్రం తరపున మంగళగిరికి చెందిన పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక ఎంపికయినట్లు కోచ్ షేక్ సంధాని తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో చంద్రికను గుంటూరు జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ చంద్రిక 84 కేజీల విభాగంలో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. చంద్రిక పోటీలలో ప్రతిభ కనబరచి పతకాలు సాధించాలని కోరుతూ అభినందించిన వారిలో అసోషియేషన్ ప్రతినిధులు కొమ్మాకుల విజయభాస్కరావు, షేక్ సంధాని, మద్ది ప్రభాకర్, సకల సూర్యనారాయణ, సకల కోటేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- ఎమ్మెల్యే ఆర్కేతో కలిసి వెనిగండ్లలో ఎన్నికల ప్రచారం



వెనిగండ్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ, మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే



బహిరంగ సభలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో ఆదివారం మంగళగిరి ఎమ్మెల్యే, నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌చార్జి ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)తో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. రామాలయం, చర్చి, మసీదుల్లో పూజలు, ప్రార్థనలు చేసి ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. వెనిగండ్ల గ్రామంలో మాజీ సర్పంచి బుల్లా ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రాజకీయాల్లోకి రాకముందే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని భజరంగ్ ఫౌండేషన్‌ను స్థాపించి ఉచితంగా వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. జగన్నామ సంక్షేమ సంగమం పేరుతో వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు. కంటి వైద్య పరీక్షలు చేసి కళ్లజోళ్లు పంపిణీ చేయడంతో పాటు గుండె పరీక్షలు చేసి యాంజియోగ్రామ్ పరీక్షలు, సర్జరీలు చేయించడం జరిగిందన్నారు. అలాగే ఫిజియోథెరపీ సేవలు, కృత్రిమ కాళ్లు అవసరమైన వారికి జైపూర్ ఫుట్స్ అందజేయడం జరిగిందన్నారు. వర్గాలు, గ్రూపులు, కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలోని 60 గ్రామాల్లో పర్యటించి 27 వేల మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. సంగం డెయిరీలో ఒక్క రూపాయి పెట్టుబడి పెట్టకుండా మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. ఆ డబ్బుతో 11 ఎకరాల్లో డీవీసీ పేరుతో ఆసుపత్రి నిర్మించడం జరిగిందన్నారు. పాడి రైతులు అనారోగ్యానికి గురైతే ఉచితంగా వైద్యసేవలు అందిస్తానని ఆసుపత్రి నిర్మించి కార్పొరేట్ ఆసుపత్రిల్లో మాదిరిగా ఫీజులు వసూలు చేస్తూ, అదే వైద్యానికి డెయిరీ నుంచి కూడా బిల్లులు పెట్టుకుని డెయిరీ సొమ్ము కొల్లగొడుతున్నాడన్నారు. 25 ఏళ్లుగా సంగం డెయిరీని పీల్చి పిప్పి చేస్తున్న ఘనుడు నరేంద్రకుమార్ అని ఆరోపించారు.

సొంతగ్రామం చింతలపూడిలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కళ్యాణమండపం అద్దెలు ఇప్పటికీ వసూలు చేసుకుంటున్నాడని ఆరోపించారు. వెల్లలూరు గ్రామంలో గ్రూపులు సృష్టించి గొడవల్ని ప్రోత్సహిస్తున్నాడన్నారు. సొంత గ్రామాన్నే అభివృద్ధి చేయలేని వ్యక్తి నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తాడో ప్రజలందరూ ఆలోచించాలన్నారు. తొలుత గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి, మానవహక్కుల కమిషన్ మాజీ సభ్యుడు గోచిపాతల శ్రీనివాసరావు, ఉప సర్పంచి కొండమడుగుల వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మున్నంగి నాగరాణి, కె.లక్ష్మీరాజ్యం, దంతాల శివపార్వతి, మాజీ సర్పంచి కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, కొండా సుబ్బారెడ్డి, ఆత్మకూరి శేషిరెడ్డి(అబ్బులు), సయ్యద్ సుభాని, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, శ్రీరెడ్డి, కట్టా శంకర్, ఆళ్ల ధర్మారెడ్డి, మున్నంగి కోటిరెడ్డి, శ్రీకాంత్, పలువురు వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉగాది ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 9వ తేదీన ఉగాది పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుఝామునుంచి ప్రత్యేక పూజలతో స్వామివారికి విశేష ముత్యాల అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారన్నారు. ఉగాది పచ్చడి పంపిణీ, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు ఈ విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కాకుమాను: పెదనందిపాడు మండలంలోని పాలపర్రులో అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను, వాహనాన్ని ఆదివారం వేకువజామున అదుపులోకి తీసుకున్నట్లు పెదనందిపాడు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పాలపర్రు గ్రామం నుంచి ఆదివారం వేకువజామున సుమారు నాలుగు గంటల సమయంలో ఏపీ 39 యుసీ 1610 నంబరు గల వాహనంలో 80 బస్తాలు(40 క్వింటాళ్లు) పీడీఎస్ బియ్యంను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో కాపు కాసి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూశాఖ అధికారులు అందజేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి

- ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం
- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్
- వట్టిచెరుకూరు మండలంలో పలు గ్రామాల్లో పర్యటన



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నే కాబోతున్నారని, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసి ప్రతి కుటుంబంలో పెద్దకొడుకుగా జగనన్న ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలంలోని గ్రామాల్లో విస్తృత స్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కుర్నూతల, చింతపల్లిపాడు, గారపాడు, యామర్తి, పల్లపాడు గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లోని గ్రామ స్థాయి నాయకులను కలిశారు. బూత్‌లెవల్ నాయకులతో చర్చించారు. గ్రామాల్లో ప్రజలను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు బలసానికి ఘనస్వాగతం పలికారు. అనంతరం స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. ఆడబిడ్డల మోములో చిరునవ్వులు చూసేందుకు మీ తోడుగా అక్కడ జగనన్న ఉన్నారని, ఇక్కడ మీకు అండగా ఈ కిరణన్న ఉన్నాడని భరోసా కల్పించారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నవరత్నాల పథకాలతోపాటు అనేక సంక్షేమ పథకాలను ప్రతి ఇంటి వద్దకు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. ప్రతి సంక్షేమ పథకం చెప్పిన సమయానికి పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా వారి ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నారని తెలిపారు. ప్రతి పేదవానికి సొంత ఇల్లు ఉండాలని రాష్ట్రవ్యాప్తంగా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలను అందించి, వాటిని అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్‌లు చేయించటం మనం చూశామన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ సొంత ఇల్లు కలిగి ఉండాలని జగనన్న కాలనీలను ఏర్పాటు చేస్తున్న మహానాయకుడు మన జగనన్న అని తెలిపారు. జగనన్న పంపితే సామాన్యుడిగా మీ ముందుకొచ్చానని, తనను ఆశీర్వదించాలని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేద్దామని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, వివిధ సొసైటీల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్‌లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, డివిజన్ల కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో జీవీఆర్ఎస్ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్ డాక్టర్ సింధూర, డైరెక్టర్ కరిమున్నీసా

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి ఉపాధి లక్ష్యంగా తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని జీవీఆర్ఎస్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్.సింధూర తెలిపారు. ఆదివారం బుడంపాడు గ్రామంలోని కళాశాలలో విజయవాడకు చెందిన ఐటీటీ హ్యాకథాన్, స్పైప్రో సెక్యూరిటీ సొల్యూషన్స్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతిక నైపుణ్యం ఎంతో అవసరమని తెలిపారు. తమ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో మొత్తం 160 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 100 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులను స్పైప్రో ట్రైనర్ చైతన్యరాణి, కళాశాల డైరెక్టర్ షేక్ కరిమున్నీసా, కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్‌బాబు, డీన్ బి.వరప్రసాద్ వివిధ విభాగాల అధిపతులు ప్రత్యేకంగా అభినందించారు.

గ్లకోమా వ్యాధికి అధునాతన చికిత్స

- కంటి వైద్యనిపుణులు డాక్టర్ కేఎస్ మూర్తి
- శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సీఎంఈ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కేఎస్ మూర్తి, డాక్టర్ సుధాకర్ పొట్టి తదితరులు

పెదకాకాని: గ్లకోమా వ్యాధికి అధునాతన చికిత్స విధానాన్ని అవలంభించాలని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె.ఎస్.మూర్తి తెలిపారు. పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శంకర అకాడమిక్ ఆఫ్ విజన్ నేతృత్వంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం (సీఎంఈ) ఆదివారం గుంటూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సుధాకర్ పొట్టి అధ్యక్షత వహించారు. డాక్టర్ మూర్తి మాట్లాడుతూ గ్లకోమా వ్యాధి లక్షణాలు, చికిత్స విధానం నూతన అనుభవాల గురించి తెలియజేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వై.శ్రీనివాస్ పవన్ మాట్లాడుతూ గ్లకోమా చికిత్స విధానాలతో ఫ్యామిలీ చరిత్ర ఆవశ్యకత గురించి తెలియజేశారు. డాక్టర్ పి.చిన్మయి, డాక్టర్ మయాంక్ రాజ్, డాక్టర్ వివేకనంద రెడ్డి, డాక్టర్ స్వాతి, జి.ఆర్.రెడ్డి తదితరులు నీటి కాసులకు సంబంధించిన నూతన వైద్య విధానం, చికిత్స విధానం గురించి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వి.సోమశేఖర్, డాక్టర్ ఎం.శ్రీధర్, డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్ పర్ని కెల్లమ్స్ మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి 211మంది నేత్ర వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం

- రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి
- ఉరుసు నిర్వహణకు వక్ఫ్‌బోర్డు కమిటీ ఏర్పాటు



ఉరుసు మహోత్సవం సందర్భంగా దర్గాలో అలంకరణలు

పెదకాకాని: సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా 536వ ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో సోమ, మంగళవారాలలో రెండు రోజుల పాటు బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం సాంప్రదాయ పద్ధతిలో వైభవంగా జరుగుతుందని తెలిపారు. ఉరుసు మహోత్సవం పురస్కరించుకుని బాజీబాబా దర్గాలో ప్రత్యేక అలంకరణ చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేశామన్నారు. పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

- ఈనెల 8వ తేదీ వేకువ జామున ప్రార్థనలతో ఉరుసు మహోత్సవం ప్రారంభమవుతుంది.
- సాయంత్రం 5 గంటలకు చాందిని అలంకరణ
- రాత్రి 10 గంటలకు ముస్లింపాలెం జెండా చెట్టు వద్ద నుంచి బాబావారి గంధం, గుర్రంపై గొప్ప ఊరేగింపు.
- ఊరేగింపు ముగించుకుని బాబావారి గుర్రం 9వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు దర్గాకు చేరుకుంటుంది.
- అనంతరం భక్తులకు గంధం పంచిపెట్టడం, దీపారాధన, ఖురాన్ పఠనం, సలామి ప్రార్థనలతో ఉరుసు మహోత్సవము ముగుస్తుందన్నారు. ఉరుసు నిర్వహణకు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా బాజీబాబా దర్గా ప్రాంగణం అంతటా విద్యుత్ కాంతులతో కళకళలాడుతుంది. దర్గా సిబ్బంది సత్తార్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

ఫిరంగిపురం: అనారోగ్యం కారణంగా మతిస్థిమితం లేని వ్యక్తి పురుగుమందు తాగి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన కె.రాంబాబు గతంలో గొర్రెలు పెంచుకునేవాడు. ప్రస్తుతం వ్యవసాయ పనులకు వెళుతున్నాడు. కొంతకాలంగా అనారోగ్యం కారణంగా మతిస్థిమితం లేదు. దీంతో శుక్రవారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. మరునాడు గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహం పక్కనే పురుగుమందు డబ్బా పడిఉంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరనారాయణ తెలిపారు.

రేపు ఉగాది పంచాంగ శ్రవణం

తెనాలి: బ్రాహ్మణ పరిషత్ తెనాలి ఆధ్వర్యంలో ఈ నెల 9న సాయంత్రం 5.30 గంటల నుంచి స్థానిక జూనియర్ కాలేజీ ఆవరణలో ఉగాది పంచాంగ శ్రవణం ఏర్పాటు చేసినట్టు పరిషత్ కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ తెలియజేశారు. జ్యోతిష్య పండితుడు బ్రహ్మశ్రీ జీవీఎల్ఎన్ చార్యులు హాజరైన వారి సందేహాలు, సమస్యలకు పరిష్కారం చెబుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పరిషత్ గౌరవాధ్యక్షుడు పెద్దిరాజు సత్యనారాయణ, లక్కరాజు లక్ష్మణరావు, బుద్ధు వెంకటేశ్వర్లు, చెన్నాప్రగడ శ్రీనివాస్, కావూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలకంపాడు పంట పొలాల్లో అగ్నిప్రమాదం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పోలకంపాడులో పాత జాతీయ రహదారికి, గుంటూరు చానల్‌కు, ఉండవల్లి ఎస్సీ కాలనీ కరకట్టకు మధ్యలో ఉన్న వంటపొలాల్లో పంట వ్యర్థాలకు ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దాదాపుగా 10 ఎకరాల్లో కోసిన వరికంకుల మోళ్లు ఉండడం, చెత్తా చెదారం ఉండడంతో చుట్టుపక్కల ఉన్న ముళ్ల పొదలకు మంటలు వ్యాపించాయి. ఆ మంటలు ఉండవల్లి ఎస్సీకాలనీ కరకట్ట వెంబడి దేవాలయ భూముల్లో ఉన్న నివాసాలవైపు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్పందించిన మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని, సుమారు 4 ఎకరాల పొలంలో వ్యాపించిన మంటలను అదుపుచేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీఎత్తున మంటలతో పాటు పొగకూడా వ్యాపించడంతో స్థానికులు పొగకు, ఎండ తీవ్రకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

క్రీస్తు రక్తంతోనే పాప ప్రక్షాళన



వాక్యోపదేశం చేస్తున్న బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి

ఫిరంగిపురం: కారుణ్య జపం, క్రీస్తు రక్తంతోనే పాప ప్రక్షాళన జరుగుతుందని బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి అన్నారు. మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో పునరుత్థానం తరువాత వచ్చే ఆదివారం దివ్యభారతి ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ సిలువపై ఉన్న క్రీస్తును సైనికులు బల్లెముతో పక్కలో పొడిచినప్పుడు శరీరం నుంచి రక్తం, నీరు వచ్చిందని, రక్తం నీరుతో భక్తుల పాప ప్రక్షాళన జరుగుతుందన్నారు. అదేవిధంగా ఒక వైపు చీకటి, ఒక వైపు వెలుగు ఎలా ఉంటుందో అదేవిధంగా దివ్యకారుణ్యం అనేది నిండి ఉంటుందని చెప్పారు. క్రైస్తవ సంఘం విధులు నాలుగు ఉన్నాయన్నారు. అవి అపోస్తలుల బోధ, సహవాసం, రొట్టె విరవడం, సంఘముగా కుటుంబం ప్రార్థనలు చేయ డం ద్వారా శక్తి ఏర్పడుతుందని తెలిపారు. దానిలో బలం, ధైర్యం నిండి ఉంటాయన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. ప్రార్థనలో ఫాదర్ విలియమ్స్, సహాయ విచారణ గురువు ఆర్.అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాతలు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

మంగళగిరి: పట్టణంలోని వీజేటీఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో స్ఫూర్తిప్రదాతలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తమ జీవితం ద్వారా సమాజంలో స్ఫూర్తినింపిన 20 మంది మహోన్నత వ్యక్తుల గురించి ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజాక్ హుస్సేన్ రచించిన సూర్తిప్రదాతలు పుస్తకం ఎందరికో స్ఫూర్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మంచా విజయరామ్మోహన్‌రావు, బీవీడీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రావి రంగారావు, డాక్టర్ మన్నవ సత్యనారాయణలు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, రేఖా కృష్ణార్జునరావు, మంచా విజయమోహనరావు, గోలి మధు, కంచర్ల కాశయ్య, సిందే బాలకృష్ణ, చిలకా వెంకటేశ్వరరావు, రేఖా నర్మద తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 'స్వరలయ' ఉగాది వేడుకలు



ఇనయతుల్లా, ఫణీంద్ర, రామలింగేశ్వరరావుకు ఉగాది పురస్కారాల ప్రదానం

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన సభకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు అధ్యక్షత వహించారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రజలందరికీ సుఖ సంతోషాలను కలిగించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు ఎం.రామలింగేశ్వరరావు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ కార్యదర్శి వేదాంతం ఫణీంద్ర, సామాజిక సేవకుడు షేక్ ఇనయతుల్లాకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, ఎల్ఐసీ ఉద్యోగుల జోనల్ జాయింట్ సెక్రటరీ జి.కిశోర్‌కుమార్ (మచిలీపట్నం), పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, రావిపాటి ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. తొలుత ఎం.సత్యవర్ధన్, కత్తి సౌజన్యచే సినీ సంగీత విభావరిని నిర్వహించారు. ముత్తింశెట్టి శివాని మహిషాసుర మర్దిని నృత్యాంశం ఆకట్టుకుంది.

భక్తిశ్రద్ధలతో లైలతుల్ ఖదర్



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్, మంగళగిరి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండలాల్లో లైలతుల్ ఖదర్ (బడీ రాత్) వేడుకలను ముస్లింలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బడీరాత్ సందర్భంగా మసీదుల్లో ఇమామ్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.. ముస్లింలు రాత్రంతా అల్లాను స్మరిస్తూ ధ్యానించారు. పలు మసీదుల్లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. రంజాన్ మాసంలో ముస్లింలు తాము దాచుకున్న దాంట్లో పేదలను ఆదుకోవాలని అప్పుడే అల్లా కరుణిస్తాడని, ప్రతి ముస్లిం తప్పనిసరిగా సేవా భావం చాటాలని ఇమామ్‌లు తెలియజేశారు.